సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



మాట నిలబెట్టుకోవాలి
ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ నేతలు నిలబెట్టుకోవాలని మాజీమంత్రి హరీష్‌రావు అన్నారు. - 8లో



గూడ్స్ రైలులో పొగలు
యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ వెళ్తున్న గూడ్స్ రైలులో పొగలు వచ్చాయి. - 8లో



సీఎం కప్ పోటీలు ప్రారంభం
సీఎం కప్ క్రీడాపోటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండలో జరిగిన సభలో లాంఛనంగా ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల గడువు 13వరకు పొడిగింపు

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 2 వరకు ఉన్న గడువును 13 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు (https:suryapet.dcourts.gov.in) వెబ్ సైట్‌లో చూడాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తులను 13 వతేదీ సాయంత్రం 5 గంటల వరకు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించాలని కోరారు.

11న ఎస్సీ వర్గీకరణపై బహిరంగ విచారణ

భానుపురి (సూర్యాపేట) :ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీం అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 11వ తేదీన నల్లగొండ కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ పై వివరణాత్మక అధ్యయనం కోసం బహిరంగ విచారణ చేయనున్నట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల ఎస్సీ కులాల సంఘం నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై వినతులు ఇవ్వాలని కోరారు.

25వరకు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : డిసెంబర్ 25 వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోఅదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలసి జిల్లాలోని ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వార్డ్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీల తో వెబ్ ఎక్స్ ద్వారా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తి చేసి కుటుంబ, ఆదాయ వివరాలను గైడ్‌లైన్స్ ప్రకారం అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ విజయ్ సింగ్, డీపీఓ నారాయణరెడ్డి, డీఎస్‌ఓ రాజేశ్వర్, స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి రామచంద్రరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని పూర్తిగా నివారించాలి

జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని, అందుకు వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వంద రోజుల టీబీ క్యాంపెయిన్ సమ్మిట్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు మందులు వాడితే పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ క్షయ నివారణకు ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రామారావు, డీఎం హెచ్ ఓ కోటాచలం, ఏరియా ఆస్పత్రి డీసీహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు

భానుపురి (సూర్యాపేట) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో దేశంలోని కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను తిరిగి బానిసత్వం లోకి నెట్టేసే పని బీజేపీ చేస్తోందన్నారు. సమావేశంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, చెరుకు యాకలక్ష్మి, కె.వెంకట నారాయణ, యాల్క సోమన్న గౌడ్, ఎం. శేఖర్, వజ్జె సైదయ్య, ముత్యాలు, యాకుబ్, వట్టేపు సైదులు, రాణపంగి కృష్ణ, దనియాకుల శ్రీను, బి. స్వరాజ్యం, వజ్జె సైదయ్య, సరస్వతి, నాగమణి పాల్గొన్నారు.



సభావేదికపై జాతీయ గీతం ఆలపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

పదేళ్లలో నల్లగొండకు అన్యాయం

పోరాటాల జిల్లాకు ఇందిరమ్మ రాజ్యంలో మేలు

- ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులపై కేసీఆర్ నిర్లక్ష్యం
- గోదావరి, కృష్ణాజలాలతో పాటు మూసీ నుంచి స్వచ్ఛమైన నీటిని తెస్తాం
- మంత్రి పదవిని త్యాగం చేసి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారు
- ప్రజా పాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణ రాష్ట్రం వస్తే నల్లగొండ సమస్యలు పరిష్కారం అవుతాయనుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల కేసీఆర్ పాలనలో నల్లగొండ నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఫ్లోరైడ్‌ను తరిమికొట్టేందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులను మంజూరు చేశారని, కేసీఆర్ పాలనలో వాటిని పూర్తిచేసి ఉంటే ప్రజలకు మేలు జరిగేదన్నారు. నల్లగొండలోని గంధంవారిగూడెం సమీపంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, నల్లగొండకు మేలు జరుగుతుందన్నారు. నల్లగొండ ప్రజలు మనకు అండగా నిలబడ్డారని సోనియాకు, రాహుల్ గాంధీకి చెప్పి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాగునీటి మంత్రిగా బాధ్యతలు అప్పగించామన్నారు. పెద్ద, చిన్న ప్రాజెక్టులు, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలైనా, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి ఏ నియోజకవర్గంలోనైనా ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ఎన్ని వేల కోట్లయినా అడగాల్సిన అవసరం లేదన్నారు. బజాప్తా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనుమతి ఇచ్చారని చెప్పారు. ఈ ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసి తెలంగాణకే కాదు.. దేశానికే ఆదర్శంగా నిలబెట్టేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కృష్ణా, గోదావరితోపాటు మూసీ నుంచి స్వచ్ఛమైన నీటిని తెస్తామన్నారు. జిల్లాలోని బీఆర్‌ఎస్ ఏకలింగాన్ని సూర్యాపేటకు వెళ్లి ప్రజలే అడగాలని, మూసీ వద్దంటే అందులోనే ముంచండని పిలుపునిచ్చారు.



బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్ద అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన కోమటిరెడ్డి

తెలంగాణ కోసం పదవిని త్యాగం చేసిన వెంకట్‌రెడ్డి

తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ వచ్చే వరకు ఏ పదవీ తనకు వద్దని మంత్రి పదవిని త్యాగం చేశారని, ఆయన భువనగిరికే ప్రాతినిధ్యం వహించారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ తరువాత మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం వచ్చే వరకు తనకు మంత్రి పదవి అవసరం లేదని, రాష్ట్రమే ముఖ్యమని ఉమ్మడి రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పదవిని త్యాగం చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాతే ఇందిరమ్మ రాజ్యంలో త్యాగం చేసిన పదవిని తీసుకొని ఆదర్శంగా నిలిచారన్నారు. ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి ఈ ప్రాంతం వాడేనని, తొలి దశ, మలిదశ ఉద్యమంలో నల్లగొండ పోషించిన పాత్ర మరచిపోలేనిదన్నారు. ఈ గడ్డపై ఎవరు అడుగుపెట్టినా, గాలి పీల్చుకున్నా నాటి సాయుధ రైతాంగ పోరాటమే గుర్తుకు వస్తుందన్నారు. వడిసెలలో రాళ్లు పెట్టి మహిళలు నిజాంను తరిమికొట్టిన పోరాటం గుర్తుకు వస్తుందని, మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి నర్సింహారెడ్డి, రావి నారాయణరెడ్డి, ధర్మబిక్షం వంటి నాయకులు ముందుండి పోరాటం చేశారని పేర్కొన్నారు.



నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

అన్ని ప్రాజెక్టులకు నిధులిస్తాం
– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నల్లగొండ జిల్లాలో ఎన్ని ప్రాజెక్టులు ఉన్నాయో వాటన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు ఇస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ నాయకులు నల్లగొండ ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఈ పదేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గంలో మిగిలి ఉన్న 10 కిలోమీటర్లను ఏడాదికి కిలోమీటరుచొప్పున తవ్వినా.. ఈపాటికి జిల్లాలో కృష్ణమ్మ గలగలా పారేదన్నారు. మూడేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేస్తామని.. ఎప్పుడు బిల్లులు పెట్టినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సభకు వచ్చే ముందే పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదికాని కాల్వలకు నిధులు మంజూరు చేశామన్నారు. నల్లగొండ జిల్లాలో ఒకేరోజు ఓ పక్క బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు ద్వారా నీళ్లు, మరోపక్క విద్యుదుత్పత్తితో పాటు ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తేవడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

ఏడాదిలో లక్ష ఎకరాలకు నీరిచ్చే బాధ్యత నాదే..
– భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బ్రాహ్మణవెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తయిందని.. ఆరు నెలల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి 50 వేల ఎకరాలకు నీరందిస్తామని.. సంవత్సర కాలంలో లక్ష ఎకరాలకు నీరందించేలా పనులు పూర్తి చేయించే బాధ్యత తనదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సాగర్ ఎడమకాల్వ కింద మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని లిఫ్టులకు మరమ్మతులు చేసి నూరు శాతం ఆయకట్టు స్థిరీకరణ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డిండి, నక్కలగండి ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తామన్నారు.

వచ్చేసారి కూడా కాంగ్రెస్‌దే అధికారం
– రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రంలో వచ్చేసారి కూడా కాంగ్రెస్‌దే అధికారమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఏడాది నుంచి పత్తాలేదని.. 30 మంది ఎమ్మెల్యేలున్నా.. బయటికి రావడం లేదనని ఏద్దేవా చేశారు. గతంలో మాకు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నా అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఉండి ప్రజల పక్షాన కొట్లాడారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు దంత వైద్యశాల, కనగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కాలేజీలు మంజూరు చేశారన్నారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, తాను కలిసి నల్లగొండ జిల్లాను బంగారు కొండ చేస్తామన్నారు. నల్లగొండ ప్రజలు తనను ఐదుసార్లు గెలిపించారని.. వచ్చే జన్మలో కూడా మీ రుణం తీర్చుకోలేనేమో అనిపిస్తోందన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి మనం అండగా ఉండాలని కోరారు.

ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన మూడు ప్రాజెక్టులను శనివారం ప్రారంభించారు. వాటితో పాటు వివిధ పనులకు శంకుస్థాపన చేశారు.

- సీఎం శనివారం మధ్యాహ్నం 3గంటలకు హెలికాప్టర్ ద్వారా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించి ఆ తర్వాత పంపులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అక్కడే డిస్ట్రిబ్యూటరీ పనులను ప్రారంభించారు.
- ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా 4.07 గంటలకు దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుని రెండో యూనిట్‌లో గ్రిడ్‌కు అనుసంధానం చేసి ఆ ప్రాజెక్టుకు జాతికి అంకితం చేశారు.
- సాయంత్రం 5.12 గంటలకు హెలికాప్టర్ ద్వారా నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ వద్దకు చేరుకుని మెడికల్ కాలేజీ భవనంతో పాటు బాలుర, బాలికల హాస్టల్ భవనాలను ప్రారంభించారు.
- 5.45 గంటలకు కాన్వాయ్ ద్వారా ఎస్‌ఎల్‌బీసీ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలికి చేరుకున్నారు.
- 6.12 గంటలకు ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించి 6.50 గంటలకు ముగించారు.
- సభా వేదిక పైనుంచే ముఖ్యమంత్రి వర్చువల్‌గా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి నుంచి నార్కట్‌పల్లి మండలం గోపలాయిపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి, నకిరేకల్ నుంచి కడపర్తి రోడ్డు పనులకు, నాంపల్లి, మర్రిగూడ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు, మిర్యాలగూడ నియోజకవర్గంలో రోడ్డు పనులకు, నల్లగొండ కలెక్టరేట్‌లో అదనపు భవనం పనులకు, తిప్పర్తి, కనగల్ జూనియర్ కళాశాలలు, నల్లగొండలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- సభ ముగిసే సరికి చీకటి కావడంతో సీఎం రేవంత్ రోడ్డు మార్గాన హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.

నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పద్మావతి, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, బాలునాయక్, ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి, అద్దంకి దయాకర్, పటేల్ రమేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, గుత్తా అమిత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, చెవిటి వెంకన్న పాల్గొన్నారు.



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం, చిత్రంలో మంత్రులు తదితరులు

ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదం

ఈత కల్లు తాగుదామనే కోరిక.. వారిని కాటికి పంపింది

- కారు చెరువులోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మృతి
- ప్రాణాలతో బయటపడిన ఒక యువకుడు
- భూదాన్‌పోచంపల్లి పరిధిలోని జలాల్‌పురం వద్ద ఘటన

భూదాన్‌పోచంపల్లి, భువనగిరి : మరో గంటలో ఊరంతా నిద్రలేస్తుందనగా.. ఒక్కసారిగా పిడుగులాంటి వార్త. సోషల్ మీడియాలో వైరలైన ఫొటోలు, వీడియోల ద్వారా జరిగిన ఘోరం తెలుసుకుని జనం తండోపతండాలుగా ఘటనా స్థలికి చేరుకున్నారు. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి జలాల్‌పురం వద్ద కారు చెరువులోకి దూసుకెళ్లిందని, ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని తెలుసుకుని నివ్వెరపోయారు. జలసమాధి అయిన యువకులంతా 19 నుంచి 23 ఏళ్ల లోపు వయస్సు వారే కావడం స్థానికులను కలిచివేసింది. మృతుల కుటుంబాల్లో పెనువిషాదం మిగిల్చింది. ఐదుగురు యువకులు మృతిచెందగా ఒకరు ప్రాణాలతో బయటపడ్డాడు. 100 కాల్‌తో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో కారుకు తాడుకట్టి జేసీబీ ద్వారా బయటికి తీశారు. అప్పటికే 108 వాహనాన్ని కూడా రప్పించారు. ఎవరైనా ప్రాణాలతో ఉంటే ఆసుపత్రికి తరలిద్దామని భావించారు. కానీ, కారులోనుంచి యువకులను బయటికి తీయగా అందరూ విగతజీవులుగా ఉన్నారు. అనంతరం అంబులెన్స్‌ను తెప్పించి ఐదుగురు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉదయం 6.45 గంటలకు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.




భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



తీగుళ్ల వంశీ, అక్షయ్‌కుమార్, జెల్ల వినయ్, హర్షవర్ధన్, వీరమల్ల విఘ్నేశ్వర్ మృతదేహాలు



కారులో నుంచి బయటకు వచ్చే క్రమంలో అద్దం గీరుకుపోయి గాయపడిన మణికంఠ



ఊపిరాడక పోవడంతో మృతి చెందారు

భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం వద్ద చెరువులోకి కారు దూసుకెళ్లిన ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు యువకుల మృతదేహాలకు భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఫోరెన్సిక్ వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. కారులోకి నిండా నీరు చేరడంతో అందులో ఉన్న యువకులు నీటిని మింగారు. ఈ క్రమంలో ఊపిరాడక మృతి చెందినట్లు ప్రాథమిక రిపోర్టు ప్రకారం తెలిసిందని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతుల నుంచి తీసిన భాగాలను పరీక్షల నిమిత్తం పంపినట్లు చెప్పారు.

ఈత కల్లు కోసమని వచ్చి..

వారంతా స్నేహితులు. కల్లు తాగాలనే కోరిక పుట్టింది. దాంతో శుక్రవారం రాత్రి కారులో ఆరుగురు స్నేహితులు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున పొగమంచులో దారి సరిగ్గా కనిపించకపోవడంతో వేగంగా ఉన్న కారు అదుపుతప్పి సమీపంలో ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. రెండు రోజుల క్రితం తీగుళ్ల వంశీ స్నేహితుడైన బన్నీ తన కారును వంశీ ఇంటి వద్ద పెట్టి, తాళం చెవి ఇచ్చి వెళ్లాడు. కారు అందుబాటులో ఉండటం వల్లనే ఆ యువకులకు సరదాగా షికారుకెళ్దామనే ఆలోచన వచ్చింది. కారు కూడా పూర్తిస్థాయిలో కండీషన్‌లో లేదని, కారు నడిపిన వంశీకి డ్రైవింగ్‌లో తగిన నైపుణ్యం లేదని తెలుస్తుంది. 70 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న కారును సడన్‌గా హ్యాండ్‌బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లి తలకిందులుగా పల్టీ కొట్టింది. కారు డోర్‌లాక్ కావడం, ఏం జరిగిందో తెలియని ఆందోళనతో యువకులు నీటిలో మునుగుతున్న కారులో హాహాకారాలు చేశారు. డోర్‌లాక్ తెరిచే అవకాశంలేక ఊపిరాడని స్థితిలో నీటిని మింగి ప్రాణాలొదిలారు. ముందు సీట్‌లో డ్రైవింగ్ చేస్తున్న వంశీ పక్కన కూర్చున్న మేడబోయిన మణికంఠ మాత్రం ధైర్యసాహసాలు ప్రదర్శించి అద్దాలను పగులగొట్టుకొని బయటికి వచ్చి మృత్యుంజయుడుగా నిలిచాడు. అప్పటివరకు తనతో పాటు ఎంతో సదరాగా, కబుర్లు చెప్పుకుంటూ ఉల్లాసంగా గడిపిన ఐదుగురు బాల్య స్నేహితులంతా విగతజీవులుగా మారడంతో మణికంఠ తీవ్ర షాక్‌కు గురయ్యాడు.

అతివేగమే కారణం

అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. ఉదయం 5.27 గంటల సమయంలో జలాల్‌పురం వద్ద చెరువులో కారు పడిపోయిందని 100 నంబర్ నుంచి కాల్ వచ్చింది. వెంటనే ఎస్‌ఐ, సిబ్బంది బయలుదేరి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో చెరువులోనుంచి కారును బయటకు తీయించారు. మణికంఠ అనే యువకుడు కారు అద్దాలు పగులగొట్టుకొని బయటికి రాగా.. మిగతా ఐదుగురు మృతి చెందారు. కారు అతివేగంతో రావడం వల్ల చెరువు పక్కన ఉన్న కడీలను ఢీకొట్టి చెరువులో పడిపోయింది. భూదాన్‌పోచంపల్లి నుంచి వలిగొండకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ

ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణ మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి ఉదయం 11 గంటల తర్వాత చేరుకోవడం మొదలుపెట్టారు. వీరి రాకతో ఆస్పత్రి ఆవరణ నిండిపోయింది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు చూసి స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. మధ్యాహ్నం తర్వాత పోస్టుమార్టం ప్రక్రియను ఫోరెన్సిక్ వైద్యుల సమక్షంలో ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీ వద్ద రోదిస్తున్న వినయ్ తల్లిదండ్రులు

క్లుప్తంగా

సీఎం కప్ పోటీలు ప్రారంభం

- నల్లగొండలో బహిరంగ సభావేదికపై ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- స్పోర్ట్స్ అథారిటీ అధికారిక గీతం ఆవిష్కరణ



పోటీలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్–2024 క్రీడాపోటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల బహిరంగ సభావేదికపై నుంచి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారిక గీతాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారుల సమాచారాన్ని సేకరించాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో క్రీడాపోటీలను పండుగ వాతావారణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరిసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

గూడ్స్ రైలులో పొగలు



పొగలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

యాదగిరిగుట్ట రూరల్: బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలులో అకస్మాత్తుగా పొగలు వచ్చాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఖాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు యాదగిరిగుట్ట మండలం వంగపల్లి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా రైలులో నుంచి పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలును వంగపల్లి గ్రామం వద్ద నిలిపివేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పొగలను అదుపు చేశారు. గూడ్స్ రైలులో బొగ్గు ఉండడంతో వాటి రాపిడికి పొగలు వచ్చినట్లు రైల్వే సిబ్బంది భావిస్తున్నారు. శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో గూడ్స్ రైలు సికింద్రాబాద్‌కు బయల్దేరింది. ఈ పొగలతో ఎలాంటి నష్టం జరగలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చౌటుప్పల్: సంపులోని నీటిని ఇంటి పైన ట్యాంకులోకి ఎక్కించేందుకు మోటారు కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శనివారం జరిగింది. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన చింతల భారతమ్మ (50) శనివారం ఉదయం తన ఇంట్లోని సంపు నుంచి నీటిని ఇంటి పైన ట్యాంకులోకి ఎక్కించేందుకు గాను మోటారుకు ఉన్న వైరు కనెక్షన్‌ను కలుపుతుండగా.. అప్పటికే మోటారు స్విచ్ ఆన్ చేసి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల వారు గమనించి ఆమెను చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నల్లగొండలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సభా వేదికపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పూజలు చేస్తున్న సీఎం, మంత్రులు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో చేతులు పైకెత్తి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నాయకులు



నల్లగొండలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు హాజరైన నాయకులు, ప్రజలకు ర్యాంప్‌పై నడుస్తూ అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అధికారులు, సిబ్బందితో ఫొటో దిగిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు వద్ద సీఎంకు స్వాగతం పలుకుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండలో సభా వేదికపై సీఎంకు సమస్యలు వివరిస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

ఒక్కో కుటుంబానిది ఒక్కో వ్యథ

- కారు చెరువులో మునిగిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాల్లో తీరని శోకం
- మృతులంతా యువకులే.. స్వయం ఉపాధితో కుటుంబాలకు ఆసరా
- కొన్నేళ్ల క్రితం బతుకుదెరువుకు ఎల్‌బీనగర్‌కు వెళ్లి అక్కడే నివాసం



భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

భువనగిరి, రామన్నపేట, వలిగొండ, మునుగోడు : భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం వద్ద చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతిచెందిన కుటుంబాల వారంతా నిరుపేదలే. వీరు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు వెళ్లి పక్కపక్కన కాలనీల్లో ఉంటున్నారు. వీరంతా రోజూ సాయంత్రం సమయంలో కలుసుకుంటారు. ప్రతి శనివారం సమీపంలోని అంజనేయస్వామి దేవాలయాలనికి వెళ్తుంటారు. తెల్లవారితే అంజనేయస్వామి దేవాలయానికి వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే విషాదకర ఘటన చోటు చేసుకుందని విలపించారు.

పనికోసం వెళ్తున్నానని చెప్పి..

ఇందులో కలకోటి అక్షయ్‌కుమార్ స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సంగెం గ్రామం. కలకోటి నర్సింహాచారి, విమలకు ఇద్దరు కుమారులు. వీరు బతుకుదెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి ఎల్‌బీనగర్‌లోని సిరినగర్‌లో నివాసం ఉంటున్నారు. నర్సింహాచారి వండ్రంగి పనిచేస్తుండగా, విమల ప్రైవేట్ జాబ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కుమారుడు అక్షయ్‌కుమార్ (బల్లు) ఇంటర్ పూర్తిచేశాడు. ఈనెల 5వ తేదీ సాయంత్రం పనికోసం వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడని, తమ కుమారుడిని విగతజీవిగా చూస్తామనుకోలేదని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. అక్షయ్‌కుమార్ మృతితో అతని స్వగ్రామం సంగెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల సత్యనారాయణ యాదమ్మ దంపతుల చిన్న కుమారుడు విగ్నేశ్వర్. ఆర్టీసీలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. సత్యనారాయణకు 30 ఏళ్ల క్రితం వివాహమైనప్పటికీ సంతానం కలగకపోవడంతో అతడి తమ్ముడి కుమారుడిని దత్తత తీసుకున్నాడు. ఆయన దత్తత తీసుకున్న మూడు సంవత్సరాల తర్వాత విగ్నేశ్వర్ జన్మించాడు. ఆ తర్వాత వారికి కుమార్తె కూడా జన్మించింది. ఇంటర్ వరకు చదివిన విగ్నేష్ ఇలా ప్రమాదంలో మృతి చెందడం పట్ల కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

కారు డ్రైవర్‌గా హర్షవర్దన్

హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లోని శివగంగ కాలనీ చెందిన ఇంద్రపల్లి శ్రీనివాస్–మధురవాణిలకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండో కుమారుడు హర్షవర్దన్(22). వీరు ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు సైతం డ్రైవర్‌గానే పనిచేస్తున్నాడు. జలాల్‌పూర్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఇతడు సైతం మృతి చెందాడు.

ప్రాణాలతో బయటపడిన మణికంత యాదవ్‌ది లక్ష్మాపురం

ప్రాణాలతో బయటపడిన మేడబోయిన మణికంత యాదవ్ స్వగ్రామం యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం. తల్లిదండ్రులు వెంకన్న–పద్మ. వ్యవసాయ కూలీలు. వారికి రవి, మణికంత ఇద్దరు కుమారులు. వెంకన్న ఆరేళ్ల క్రితం చనిపోయాడు. తల్లి పద్మ ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఉంటూ కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించింది. గ్రామంలో సొంత ఇల్లు ఉన్నది. పండుగలు, ఇతర సమయాల్లో గ్రామానికి వచ్చి వెళ్తుంటారు.

టీవీ పెట్టగానే నా కొడుకు చనిపోయినట్లు చూశా..

మా బంధువులు చనిపోతే అంత్యక్రియల కోసం గటుప్పల్ వెళ్లాం. రాత్రి కావడంలో హైదరాబాద్‌కు పోకుండా స్వగ్రామైన రామన్నపేట మండలంలోని బోగారంలోని ఇంటికి వెళ్లాం. ఉదయం ఇంట్లో టీవీ పెట్టగానే కారు చెరువులోకి దూసుకెళ్లి యువకులు మృతి చెందిన వార్త వస్తుంది. అందులో తన కొడుకు ఉన్నట్లు చూశాను. శుక్రవారం సాయంత్రం సినిమాకు పోతానని చెప్పాడు. చివరిసారిగా మాట్లాడింది అదే.

–మృతుడు వినయ్ తల్లి వనజ

పుష్ప–2 సినిమాకు వెళ్తానని..

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామానికి చెందిన జెల్ల వెంకటేశం, వనజ దంపతులది చేనేత కుటుంబం. బతుకుదెరువు నిమిత్తం 30 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఎల్‌బీనగర్ పరిధిలోని వాస్తుకాలనీలో నివాసం ఉంటున్నారు. వెంకటేశం ఎల్‌బీనగర్‌లో ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు వినయ్ ప్రస్తుతం ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వెంకటేశం, వనజ ఈ నెల 5న గట్టుప్పల్‌లోని తమ బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామమైన బోగారం వెళ్లారు. ఇదే రోజు సాయంత్రం 4.30 గంటలకు వినయ్ తండ్రికి ఫోన్ చేసి పుష్ప–2 సినిమాకు వెళ్తానని, రూ. 350 ఫోన్ పే చేయాలని అడగడంతో అతనికి డబ్బులు పంపాడు. రాత్రి 11 గంటల సమయంలో పలుమార్లు ఫోన్ చేసినా వినయ్ ఫోన్ లిఫ్ట్ చేయలేదని, తెల్లవారేసరికి తన కుమారుడి చావు వార్త తెలిసిందని వెంకటేశం కన్నీరుమున్నీరయ్యాడు.

భోజనానికి వచ్చినా బతికేవాడేమో..

సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండిమైలారం గ్రామానికి చెందిన తీగుల్ల శంకర్, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు చాలా ఏళ్లక్రితం హైదరాబాద్‌కు బతుకుదెరువు నిమిత్తం వెళ్లారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గల సిరినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. శంకర్ ఆటో డ్రైవర్, తల్లి కర్రీ పాయింట్ నిర్వహిస్తుంది. వీరి చిన్న కుమారుడు వంశీ(23) ఇంటర్ పూర్తి చేశారు. వంశీ ఈ నెల 6న రాత్రి 11.30 గంటల వరకు ఇంటి వద్దనే స్నేహితులతో ఉన్నాడు. భోజనం చేయమని పిలువగా తరువాత చేస్తానని చెప్పాడని, ఇంట్లోకి వచ్చి ఉంటే తమ కుమారుడు బతికి ఉండేవాడేమోనని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కంటనీరు పెట్టుకుంటూ బంధువులతో చెప్పారు.

వైద్య విద్యార్థులతో సీఎం ముఖాముఖి



ప్రభుత్వ వైద్య కళాశాలలో తరగతి గదులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రులు భట్టివిక్రమార్క ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి



మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థిని



మెడికల్ విద్యార్థులకు ఆప్రాన్ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎల్‌బీసీ వద్ద నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆప్రాన్‌లు పంపిణీ చేశారు. అక్కడే నర్సింగ్ కళాశాలకు సీఎం శంకుస్థాపన చేశారు. మంత్రి కోమటిరెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం రెండు బస్సులను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు మంత్రులు, ఎంపీ కలిసి ఎంబీబీఎస్ విద్యార్థులతో గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి మాట్లాడారు.

గవర్నమెంట్‌లోనే చదువుకున్నాను



నేను 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు బీసీ గురుకులంలో చదివాను. ఇంటర్మీడియట్ ఎస్సీ గురుకులంలో చదివాను. వైద్య విద్య కూడా గవర్నమెంట్ కాలేజీలో చదవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ పెట్టి నా లాంటి వారికి వైద్య విద్య అందించడం అభినందనీయం. మెడికల్ కాలేజీలో మంచి లైబ్రరీ, హాస్టల్ సదుపాయం కల్పించడంపై ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– చిన్ను, వైద్య విద్యార్థి, నాగర్‌కర్నూల్ జిల్లా

వైద్య విద్య అందించడం అభినందనీయం



నేను ఆలిండియా కోటాలో ఇక్కడి మెడికల్ కాలేజీలో సీటు పొందాను. తెలంగాణలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ నిర్మించడం గొప్ప విషయం. వైద్య విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఎక్కువగా పెట్టడం ద్వారా చాలా మంది వైద్య విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ప్రశాంత్‌కుమార్‌సింగ్, బీహార్

మలుపు వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న జలాల్‌పురం గ్రామస్తులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువు కట్ట వద్ద మూలమలుపులను సరిచేయాలని, అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేయాలని శనివారం గ్రామస్తులు చెరువు కట్ట వద్ద రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. చెరువు కట్ట వద్ద రక్షణ గోడ, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. విషయం తెలుసుకొన్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఫోన్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో ఏసీపీ మాట్లాడగా.. భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బైరు బాలరాజు, కొయ్యడ శ్రీనివాస్, గోరంటి ప్రదీప్‌రెడ్డి, పాలకూర్ల కుమార్, కేసారం సురేందర్‌రెడ్డి, గుండ్ల రమేశ్, భాస్కర్, దర్శన్, శ్రీరాములు, పాలకూర్ల నవీన్, శివాజీ, ఉపేందర్, మల్లేశ్, బైరు భారత్, కొయ్యడ శ్రీకాంత్, గణేశ్, పిట్ట శ్రీకాంత్‌రెడ్డి, గుండ్ల పరమేశ్, శశిధర్‌రెడ్డి, క్రాంతికుమార్, దినేశ్, ఆకాశ్, రాంచంద్రం, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ఢీకొని ఏఎస్‌ఐకి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిట్యాల ఏఎస్‌ఐ జానారెడ్డి

కట్టంగూర్: చోరీకి గురైన అంబులెన్స్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఏఎస్‌ఐకి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్ సన్‌రైజ్ ఆస్పత్రి ముందున్న అంబులెన్స్‌ను మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన రావుల వెంకట రామనర్సయ్య చోరీ చేసి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి మీదుగా విజయవాడ వైపు వెళ్తున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న చిట్యాల ఏఎస్‌ఐ జానారెడ్డి చిట్యాల పట్టణ కేంద్రంలో అంబులెన్స్‌ను అడ్డుకునేందుకు యత్నించగా.. నిందితుడు ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో ఏఎస్‌ఐ పోలీసు వాహనంలో అంబులెన్స్‌ను వెంబడించాడు. కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామ శివారులో అంబులెన్స్‌ను ఏఎస్‌ఐ క్రాస్ చేసి కొంతదూరం వెళ్లి రోడ్డు పక్కన పోలీసు వాహనం ఆపి అంబులెన్స్ ఎదురుగా వెళ్లి దానిని ఆపేందుకు యత్నించాడు. అంబులెన్స్ నడుపుతున్న నిందితుడు ఆపకుండా ఏఎస్‌ఐని ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో ఏఎస్‌ఐ జాన్‌రెడ్డి కాలు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీసులు అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రియాంక గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



హరీశ్‌రావుకు భూనిర్వాసితుల సమస్యను వివరిస్తున్న సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్: రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చి భూనిర్వాసితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో భువనగిరిలో ప్రియాంక గాంధీతో చెప్పించిన మాటను కాంగ్రెస్ నాయకులు నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌కు చెందిన రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు శనివారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు, రీజినల్ రింగ్‌రోడ్డుకు నడుమ 40కిలోమీటర్ల దూ రం ఉండాలన్న నిబంధనను పాటించకుండా కొందరి ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్‌ను ఏవిధంగా మార్చారో హరీశ్‌రావుకు భూనిర్వాసితులు వివరించారు. కోట్ల రూపాయల విలువైన తమ భూములను తక్కువ ధరకు తీసుకున్నారని ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తమ గోడును అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని అప్పట్లో గొప్పగా చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ అంటేనే ఇచ్చిన మాట తప్పే పార్టీ అని ఎద్దేవా చేశారు. భూనిర్వాసితులకు భూమికి భూమి ఇప్పించాలని లేదంటే బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, భూనిర్వాసితులు బోరెం ప్రకాష్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్‌గౌడ్, జాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.